సాక్షి
కాకినాడ

బుధవారం । 2 । ఏప్రిల్ । 2025



రూ.1,01,116 విరాళం


కొవ్వూరు: ద్వారకా తిరుమల దేవస్థానంలో నిత్యాన్నదానానికి డాక్టర్ బొడ్డు (సూర్యదేవర) అనసూయ (కొవ్వూరు) మంగళవారం రూ.1,01,116 విరాళం సమర్పించారు.



పరీక్షలు పూర్తయిన ఆనందం ..అంతలోనే ఆవిరి

టెన్త్ పరీక్షలు పూర్తయిన ఆనందంలో స్నేహితులతో కలసి కాలువలో ఈతకు వెళ్లిన ఓ బాలుడు మృతి చెందాడు. 8లో

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 10,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3,200, మధ్య డెల్టాకు 2 వేలు, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల నీరు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.25 అడుగులు ఉంది.

న్యూస్‌రీల్

'ఉపాధి' బకాయిలు వెంటనే చెల్లించాలి

కాకినాడ సిటీ: ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు వెంటనే వేతన బకాయిలు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సంఘం అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు అధ్యక్షతన స్థానిక సుందరయ్య భవన్‌లో మంగళవారం కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, ఏప్రిల్ మొదటి వారంలోనే ఉపాధి హామీ పనులు ప్రారంభించి, వేసవి మూడు నెలలూ పూర్తి స్థాయిలో పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం నత్తనడకన నడుస్తోందని, కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు తగ్గించడం వల్ల ఈ పరిస్థితి దాపురించిందని విమర్శించారు. జిల్లాలో మూడు నెలలుగా ఉపాధి హామీ పనులు నామమాత్రంగా జరిగాయన్నారు. చేసిన పనులకు కూడా డబ్బులు విడుదల కాక, కూలీలు నానా అవస్థలూ పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ కూలి కేవలం రూ.7 పెంచి, కనీస వేతనం రూ.307గా నిర్ణయించారని తెలిపారు. ఇక నుంచి కూలీలకు కచ్చితంగా రూ.307 వేతనం అందేవిధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టంలో ఉన్న సదుపాయాలన్నీ కూలీలకు కల్పించాలన్నారు. మేట్లకు పారితోషికం ఇవ్వాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి కేఎస్ శ్రీనివాస్, జిల్లా నాయకుడు కూరాకుల సింహాచలం, ఉపాధ్యక్షులు దుప్పి అదృష్టదీపుడు, చొల్లంగి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన టెన్త్ పరీక్షలు

సోషల్ పరీక్షకు 342 మంది గైర్హాజరు



కరప హైస్కూల్ నుంచి పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): గత నెల 17వ తేదీన ప్రారంభమైన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. చివరి రోజు సోషల్ పరీక్ష నిర్వహించారు. దీనికి 27,407 మంది హాజరు కాగా 342 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు సక్రమంగా నిర్వహించేందుకు సహకరించిన రెవెన్యూ, పోలీస్, ట్రెజరీ అధికారులకు జిల్లా విద్యా శాఖాధికారి పిల్లి రమేష్ కృతజ్ఞతలు తెలిపారు.

మట్టి లారీలను అడ్డుకుని ఆందోళన

పి.గన్నవరం: ఊడిమూడిలంక నుంచి వస్తున్న మట్టి లారీల వల్ల తమ వంతెన ధ్వంసం అవుతున్నదంటూ జి.పెదపూడి గ్రామస్తులు మంగళవారం ఆందోళన నిర్వహించారు. లంక నుంచి వస్తున్న మట్టి లారీలను వంతెన వద్ద అడ్డుకుని ఆందోళన చేపట్టారు. మట్టి లారీల రాకపోకల వల్ల వంతెన బలహీనపడుతోందని జి.పెదపూడి సర్పంచ్ దంగేటి అన్నవరంతో పాటు ఆందోళనకారులు వివరించారు. ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక ప్రజలకు ఈ వంతెన ఆధారమన్నారు. లారీల రాకపోకల వల్ల వంతెన మార్జిన్‌లో ఉన్న మంచినీటి పైపు లైన్లు ధ్వంసం అవుతున్నాయని వివరించారు. వేరే వంతెన మీదుగా మట్టి లారీలు తరలించుకోవాలని సూచించారు. ఈ నేపథ్యంలో మరో వర్గానికి చెందిన కొందరు అక్కడికి రావడంతో వివాదం తలెత్తింది. కొన్నేళ్లుగా ఈ వంతెన మీదుగా మట్టి లారీలు వెళ్తున్నాయని, అప్పుడు ఎందుకు అడ్డగించలేదని వారు ఆందోళన కారులను నిలదీశారు. వీరికి మట్టి ర్యాంపు నిర్వాహకుడి అనుచరులు కూడా తోడవడంతో ఇరువర్గాల మధ్య వివాదం పెరిగింది. విషయం తెలుసుకున్న పి.గన్నవరం ఎస్సై బి.శివకృష్ణ అక్కడికి చేరుకుని, ఇరువర్గాలతో చర్చించారు. ఒకానొక దశలో వివాదం ముదరడంతో వారిని పోలీసులు చెదరగొట్టారు. తహసీల్దార్ సమక్షంలో అధికారులతో చర్చించి వంతెన సమస్యను పరిష్కరించుకోవాలని ఎస్సై సూచించారు. అనంతరం లారీలను పంపించి వేశారు.

4 నుంచి స్లాట్ బుకింగ్‌తో రిజిస్ట్రేషన్లు

అమలాపురం టౌన్: జిల్లాలోని 15 రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ నెల 4 నుంచి స్లాట్ బుకింగ్ ద్వారా రిజిస్ట్రేషన్లు చేసుకునే వెసులుబాటు కల్పించినట్లు జిల్లా రిజిస్ట్రార్ సీహెచ్ నాగలింగేశ్వరరావు తెలిపారు. అమలాపురం రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్లాట్ బుకింగ్ విధానం అమలుపై కార్యాలయ సిబ్బందికి నాగ మల్లేశ్వరరావు అవగాహన కల్పించారు. భూముల రిజిస్ట్రేషన్లను కొనుగోలు, అమ్మకందార్లు తమకు నచ్చిన సమయంలో ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకుని ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆయన సూచించారు.



స్మార్ట్ సిటీకి చంద్రగ్రహణం

- గత ఏడాదే ముగిసిన 'స్మార్ట్' గడువు
- తొమ్మిది నెలలు పొడిగించిన కూటమి సర్కార్
- అది కూడా మార్చి 31తో చెల్లు
- చిల్లిగవ్వ విదల్చని ప్రభుత్వం
- అసంపూర్తిగా నిలిచిన అభివృద్ధి పనులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: పెన్షనర్స్ ప్యారడైజ్‌గా కాకినాడ నగరానికి పేరు. వివిధ రాష్ట్రాల్లో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పని చేసి, ఉద్యోగ విరమణ తరువాత శేష జీవితాన్ని కాకినాడలో గడపాలని చాలా మంది కలలు కంటూంటారు. అటువంటి కాకినాడ.. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా స్మార్ట్ సిటీలుగా ఎంపిక చేసిన 100 నగరాల్లో ఎనిమిదేళ్ల క్రితం చోటు దక్కించుకుంది. ఈ మేరకు 2017లో ఉత్తర్వులు జారీ చేసింది. ఈ జాబితాలో రాష్ట్రం నుంచి అమరావతి, విశాఖపట్నం, తిరుపతిలతో పాటు కాకినాడకు అవకాశం దక్కింది. స్మార్ట్ సిటీగా కాకినాడను అభివృద్ధి చేసేందుకు దశగా 2017–22 మధ్య ఐదేళ్ల కాలానికి రూ.978 కోట్లతో వివిధ ప్రతిపాదనలు చేశారు. స్మార్ట్ సిటీగా ఎంపికవడంతో ఇక్కడి ప్రజల ఆశలు, ఆకాంక్షలు, అంచనాలు భారీగా పెరిగిపోయాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యం కావడంతో స్మార్ట్ సిటీ అభివృద్ధికి తిరుగుండదని భావించారు. కేంద్ర ప్రభుత్వం తన వాటాగా ఇవ్వాల్సిన మొత్తం నిధులను దశల వారీగా విడుదల చేసింది. ఈ స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కాలపరిమితి 2022లోనే పూర్తయ్యింది. దీని కాలపరిమితిని గడచిన రెండేళ్లుగా కేంద్ర ప్రభుత్వం పెంచుతూ వస్తోంది.

ఉత్తుత్తి పొడిగింపు

ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం గద్దెనెక్కాక స్మార్ట్ సిటీ ప్రాజెక్టు గడువు ముగిసిపోయింది. దీనివలన స్మార్ట్ సిటీ నిధులు వెనక్కు పోతాయని, ఆ నిధులు విడుదల చేసి, పనులన్నీ పూర్తి చేస్తామని పేర్కొంటూ చంద్రబాబు సర్కార్ ఈ గడువును తొమ్మిది నెలల పాటు పొడిగించింది.

ఎక్కడ పనులు అక్కడే..



స్మార్ట్ సిటీ నిధులు విడుదల చేయకపోవడంతో నగరంలో పలు అభివృద్ధి పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా ఉండిపోయాయి. ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్పొరేషన్ భవనం సైతం మధ్యలోనే నిలిచిపోయింది. కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ సిటీకి కేటాయించిన నిధులను సైతం రాష్ట్ర ప్రభుత్వం వినియోగించుకోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. నగరంలో ఏ అభివృద్ధి పనులు చేయాలన్నా నిధులు లేవని కార్పొరేషన్ అధికారులు చెబుతున్నారు. స్మార్ట్ సిటీ గడువు పెంచి, నిధులు విడుదల చేయాలి.

– నల్లబిల్లి సుజాత, మాజీ కార్పొరేటర్

గడువు పెంచాలి



వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో స్మార్ట్ సిటీ గడువు రెండేళ్లు పెంచడంతో నగరంలో ఎంతో అభివృద్ధి జరిగింది. స్మార్ట్ సిటీ గడువు పెంచకపోవడం వల్ల నగర అభివృద్ధి పూర్తిగా కుంటుపడుతుంది. కార్పొరేషన్ ఎన్నికలు జరగకపోవడంతో ఆర్థిక సంఘం నిధులు రావడం లేదు. దీనివల్ల కార్పొరేషన్‌కు రావాల్సిన రూ.30 కోట్లు వెనక్కి మళ్లిపోయాయి. ఫలితంగా అభివృద్ధి జరగడం లేదు. స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ గడువు పెంచకుండా నగరాభివృద్ధి సాధ్యం కాదు.

– కోరుమిల్లి బాలప్రసాద్, మాజీ కార్పొరేటర్

చేతులెత్తేసిన కూటమి నేతలు

స్మార్ట్ సిటీ ప్రాజెక్టు గడువు ముగిసిపోవడంతో నిలిచిపోయిన పనులపై సందిగ్ధత నెలకొంది. పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు ప్రాజెక్టు గడువు మరోసారి పొడిగిస్తారా లేదా అనే సందేహాన్ని నగర ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. స్మార్ట్ సిటీని తమ హయాంలోనే సాధించామని గొప్పలు చెప్పుకున్న కూటమి నేతలు తీరా నిధుల విషయానికి వచ్చేసరికి చేతులెత్తేశారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టును పట్టాలెక్కించే దిశగా సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఉంటే నిధులు విడుదలయ్యే అవకాశం ఉండేదని పలువురు అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.186 కోట్లు విడుదల చేయాల్సి ఉండగా ఒక్క రూపాయి కూడా విదల్చలేదు. ఈ నిధులు విడుదలైతే గడువు పొడిగించిన తొమ్మిది నెలల్లో స్మార్ట్ సిటీ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులన్నీ పూర్తవుతాయని భావించిన ప్రజల ఆశలన్నీ అడియాశలే అయ్యాయి.

వైఎస్సార్ సీపీ హయాంలో పూర్తయిన ప్రాజెక్టులివీ..

- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో స్మార్ట్ సిటీ ప్రాజెక్టు నుంచి విడుదలైన రూ.400 కోట్లతో నగరంలో విశాలమైన స్మార్ట్ రోడ్లు అభివృద్ధి చేశారు.
- రూ.20 కోట్లతో రాగిరెడ్డి కళాక్షేత్రం నిర్మించారు.
- రూ.7 కోట్లతో బోటు బిల్డింగ్ యార్డు ఏర్పాటు చేశారు.
- క్రీడాకారులను ప్రోత్సహించే లక్ష్యంతో రూ.10 కోట్లతో అంతర్జాతీయ స్థాయిలో స్కేటింగ్ రింక్ నిర్మించారు.
- రూ.30 కోట్లతో కన్వర్టబుల్ స్టేడియం అందుబాటులోకి తెచ్చారు.
- రూ.100 కోట్లతో కమాండ్ కంట్రోల్ సెంటర్ వంటి ముఖ్యమైన ప్రాజెక్టులను నగర ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు.

పెండింగ్‌లో ఉన్న స్మార్ట్ సిటీ పనులన్నింటినీ ఈ తొమ్మిది నెలల కాలంలో చంద్రబాబు పట్టాలెక్కిస్తారని కూటమి నేతలు నగర ప్రజలకు ఆశలు కల్పించారు. ఫలితంగా వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్న పనులన్నీ పూర్తవుతాయని నగర ప్రజలు ఎంతో ఆశతో ఎదురు చూశారు. అయితే, ఈ పొడిగింపు ఉత్తర్వుల కాలపరిమితి కూడా తాజాగా మార్చి 31తో ముగిసిపోయింది. ఆర్భాటంగా స్మార్ట్ సిటీ ప్రాజెక్టు గడువు పొడిగించారే తప్ప నిధుల విడుదలలో కనీస శ్రద్ధ కూడా చూపించలేదు. చివరకు స్మార్ట్ సిటీ పెండింగ్ పనులన్నింటినీ అటకెక్కించారు. ఈ పరిస్థితుల్లో అసంపూర్తిగా నిలిచిపోయిన పనులు కొనసాగడం కష్టమేననే విమర్శలు వినిపిస్తున్నాయి. చంద్రబాబు చెప్పే మాటలకు, ఇచ్చే హామీలకు, చేసే పనులకు అసలు పొంతనే ఉండదనేది జగమెరిగిన సత్యం. సంపద సృష్టిస్తాను, నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తాను, అభివృద్ధికి మారుపేరుగా నిలుస్తానని చెప్పుకొచ్చిన చంద్రబాబు గడచిన తొమ్మిది నెలల కాలంలో కాకినాడ స్మార్ట్ సిటీకి ఒక్క రూపాయి కూడా విదిల్చిన దాఖలాలు లేవు. తద్వారా స్మార్ట్‌గా నగర ప్రజలను మోసం చేశారని పలువురు విమర్శిస్తున్నారు.

నిలిచిపోయిన పనులివీ..

- నగరంలోని విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండేలా అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సైన్స్ సెంటర్ ప్రాజెక్టు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా నిలిచిపోయింది. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి, వారి నైపుణ్యానికి పదును పెట్టే సంకల్పంతో రూ.15 కోట్లతో ఈ సైన్స్ సెంటర్‌కు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో శ్రీకారం చుట్టారు. ఈ సెంటర్‌కు గత ప్రభుత్వంలో చేసిన పనులే తప్ప, కూటమి గద్దెనెక్కాక ఒక్క ఇటుక కూడా పెట్టిన పాపాన పోలేదు.
- బ్రిటిష్ వారి కాలంలో నిర్మించిన నగర పాలక సంస్థ కార్యాలయం స్థానే అన్ని హంగులతో అత్యంత ఆధునికత ఉట్టిపడేలా కొత్త భవంతి నిర్మాణానికి గత సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి హయాంలో శ్రీకారం చుట్టారు. రూ.40 కోట్లతో చేపట్టిన ఈ భవన నిర్మాణం చివరి దశలో ఉండగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఈ భవనం అసంపూర్తిగా మిగిలింది. కాంట్రాక్టర్ కూడా పనులు నిలిపివేశారు. ఫలితంగా నగరపాలక సంస్థ కార్యకలాపాలను నగరంలోని నాలుగు ప్రాంతాల నుంచి నిర్వహించాల్సిన దుస్థితి దాపురించింది.
- వివిధ ప్రాంతాల్లోని పాఠశాలల్లో అత్యాధునిక మౌలిక వసతులు కల్పించేందుకు రూ.30 కోట్లతో చేపట్టిన పనులు చివరి దశలో ఉండగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ప్రాజెక్టు గడువు పొడిగించినా ఈ పనులకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. కేంద్ర ప్రభుత్వం మొత్తం నిధులు విడుదల చేయగా, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం నిధుల విడుదలను కేవలం కాగితాలకే పరిమితం చేసింది.

ముమ్మరంగా ఇంజినీరింగ్ పనులు

ప్రత్యేకాధికారి వీరపాండ్యన్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి వీరపాండ్యన్

కాకినాడ సిటీ: వర్షాలు ప్రారంభమయ్యేలోపు రానున్న మూడు నెలల్లో జిల్లాలో చేపట్టిన ఇంజినీరింగ్ పనులను ముమ్మరంగా నిర్వహించాలని జిల్లా ప్రత్యేకాధికారి, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జి.వీరపాండ్యన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కోర్టు హాలులో మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన కలెక్టర్ల సదస్సులో జిల్లా అభివృద్ధికి సంబంధించి వివిధ శాఖల ద్వారా తాను సమర్పించిన అంశాలను కలెక్టర్ షణ్మోహన్ ఆయనకు వివరించారు. అనంతరం వీరపాండ్యన్ మాట్లాడుతూ, రానున్న మూడు నెలల్లో కూలీలకు పెద్ద సంఖ్యలో ఉపాధి హామీ పనులు కల్పించాలని కోరారు. ఎండలను దృష్టిలో ఉంచుకుని ఉదయం 11 గంటలలోపు, మధ్యాహ్నం 4 గంటల తర్వాత పనులు చేయించాలని సూచించారు. వేసవిలో తాగునీటి సరఫరాపై, ముఖ్యంగా నీటి ఎద్దడి ఎదురయ్యే ప్రాంతాలపై దృష్టి సారించాలని ఆదేశించారు. నీటి వనరులన్నింటినీ శుభ్రపరచి, ఫ్లషింగ్ చేయించాలన్నారు. వడదెబ్బ బాధితులకు చికిత్స అందించేందుకు పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా, జిల్లా ఆసుపత్రుల్లో 4 నుంచి 6 పడకలతో ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ప్రతి ఏఎస్ఎం వద్ద 500, పీహెచ్‌సీల్లో వెయ్యి, సీహెచ్‌సీల్లో 5 వేలు, జిల్లా ఆసుపత్రిలో 10 వేలు చొప్పున ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. అన్ని అంబులెన్స్‌ల్లో ఎమర్జెన్సీ రెస్క్యూ మెకానిజం ఏర్పాటు చేయాలన్నారు. కాలువలు, చెరువులు, కుంటల్లో ఈతకు వెళ్లి ప్రమాదాలకు లోను కాకుండా చూడాలని, తల్లిదండ్రులను అప్రమత్తం చేయాలని వీరపాండ్యన్ సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన, డీఆర్ఓ వెంకటరావు, జెడ్పీ సీఈఓ వీవీవీఎస్ లక్ష్మణరావు, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, డీఈఓ పి.రమేష్, డీఎంహెచ్ఓ జె.నరసింహనాయక్ తదితరులు పాల్గొన్నారు.

పింఛను సొమ్ముతో పరారీ



పింఛను సొమ్ముతో పరారైన వెంకట రమణ

పిఠాపురం: వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఇవ్వాల్సిన పింఛను సొమ్ముతో ఓ ఉద్యోగి పరారైన సంఘటన పిఠాపురంలో చోటు చేసుకుంది. మున్సిపల్ కమిషనర్ నామా కనకారావు కథనం ప్రకారం.. పురపాలక సంఘం పరిధిలోని ఆరో సచివాలయంలో ఎర్రా వెంకట రమణ శానిటేషన్ సెక్రటరీగా పని చేస్తున్నాడు. 11, 12 వార్డు ప్రజలకు పెన్షన్ డిస్ట్రిబ్యూషన్ అధికారిగా కూడా ఆయనకు బాధ్యతలు అప్పగించారు. వెంకట రమణ 42 మంది పింఛన్‌దారులకు పింఛన్లు అందించాల్సి ఉంది. దీని కోసం రూ.1.82 లక్షలు అతడికి ఇవ్వగా, రూ.32 వేల నగదును వార్డు అడ్మిన్ సెక్రటరీ రవి వద్ద ఉంచాడు. మిగిలిన రూ.1.50 లక్షలు పింఛనుదార్లకు ఇవ్వకుండా వెంకట రమణ పరారయ్యాడు. ఈ మేరకు అతడిపై పిఠాపురం పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు కమిషనర్ తెలిపారు. ఇదిలా ఉండగా వెంకట రమణ నాలుగు నెలల క్రితం కూడా లబ్ధిదారుల నుంచి వేలిముద్రలు తీసుకుని పింఛన్ సొమ్ము ఇవ్వకుండా పరారై, రెండు రోజుల అనంతరం పంపిణీ చేసిన ఉదంతం ప్రస్తుతం వెలుగులోకి వచ్చింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వెంకట రమణను సస్పెండ్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆ వార్డులో మరో ఉద్యోగి ద్వారా లబ్ధిదారులకు కమిషనర్ పింఛన్లు పంపిణీ చేయించారు. పింఛన్ల పంపిణీలో ఒకసారి అతకతవకలకు పాల్పడిన ఉద్యోగికే మళ్లీ ఆ బాధ్యతలు అప్పగించడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఇది ముమ్మాటికీ అధికారుల నిర్లక్ష్యమేనని అంటున్నారు. కాగా, వెంకట రమణ కొంత కాలంగా షేర్ మార్కెట్‌కు బానిసై ఇలా సొమ్ము పక్కదారి పట్టిస్తున్నాడనే ఆరోపణలున్నాయి.



పుంజుకొంటున్న పౌల్ట్రీ

సాక్షి, అమలాపురం: బర్డ్ ఫ్లూతో విలవిలలాడిన కోడి కోలుకుంటోంది. సంక్రాంతి తరువాత మొదలైన పౌల్ట్రీ రైతుల కష్టాలు.. ఇంచుమించు తెలుగు సంవత్సరాది వరకు కొనసాగాయి. గత వారం రోజుల నుంచి కోడి ధర క్రమేపీ పెరుగుతూ ఇప్పుడు కొండెక్కింది. బర్డ్ ఫ్లూ దెబ్బకు కోళ్ల పెంపకాన్ని రైతులు తగ్గించి వేయడంతో... డిమాండ్‌లో సగం కూడా కోళ్లు మార్కెట్‌కు రాకపోవడంతో వాటి ధర అంచనాలకు మించి పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు.

పౌల్ట్రీలపై బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్

తూర్పు గోదావరి జిల్లాలో 2.50 కోట్ల వరకు గుడ్లు పెట్టే కోళ్లు, నాలుగు లక్షల వరకు బ్రాయిలర్ కోళ్ల పెంపకం జరుగుతోంది. ఈ జిల్లాలో ప్రతి రోజూ 80 లక్షల కోడిగుడ్ల ఉత్పత్తి అవుతుండగా 48 లక్షల గుడ్లు ఒడిశా, బిహార్, కోల్‌కతాలకు ఎగుమతవుతున్నాయి. కాకినాడ జిల్లాలో ఐదు లక్షల లేయర్ కోళ్లు పెరుగుతున్నాయి. లక్షకు పైగా నాటు కోళ్ల పెంపకం జరుగుతోంది. మరో మూడు లక్షల వరకు బ్రాయిలర్ కోళ్ల పెంపకం సాగుతోందని అంచనా.



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లాలో 18 కమర్షియల్ పౌల్ట్రీ ఫామ్‌లు ఉండగా వీటిలో సుమారు 57 లక్షలకు పైగా కోళ్లు ఉన్నాయని పశు సంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు. వీటిలో 5 లక్షల వరకు బ్రాయిలర్ ఫామ్‌లు కాగా, మిగిలిన లేయర్ (కోడి గుడ్డు పెట్టే) కోళ్లు. మూడు జిల్లాల్లో రోజుకు 100 టన్నుల వరకు కోడి మాంసం విక్రయాలు చేసేవారు. అదే ఆదివారం, ఇతర పండగల సమయంలో 150 టన్నుల వరకు విక్రయాలు ఉంటాయని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.

- బర్డ్‌ఫ్లూ నుంచి కోలుకుంటున్న కోడి
- భారీగా పెరిగిన బ్రాయిలర్.. లేయర్ కోడి ధరలు
- బ్రాయిలర్ రైతు వద్ద కేజీ రూ.152, రిటైల్ రూ.175
- లేయర్ లైవ్ రైతు వద్ద కేజీ రూ.125
- బ్రాయిలర్ మాంసం కేజీ రూ.300.. లేయర్ మాంసం కేజీ రూ.200
- డిమాండ్‌లో మూడు వంతులు మాత్రమే మార్కెట్‌కు

గత ఫిబ్రవరిలో తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం కానూరి అగ్రహారంలో లక్షలాది కోళ్లు మృతి చెందడంతో ఆ ప్రభావం మూడు జిల్లాల పౌల్ట్రీలపై పడింది. బర్డ్ ఫ్లూకు ముందు కిలో చికెన్ ధర రూ.240 నుంచి రూ.260 వరకూ ఉండేది. బర్డ్ ఫ్లూ భయంతో నాలుగైదు రోజులలో అది కాస్తా కేజీ రూ.150కి పడిపోయింది. తరువాత కేజీ రూ.120కి చేరింది. ధర తగ్గడం అటుంచి వారం రోజుల పాటు ప్రభుత్వ అధికారులే కోడి మాంసం విక్రయాలను అడ్డుకున్నారు. తరువాత అమ్మకాలకు అనుమతి ఇచ్చినా నెల రోజుల పాటు చికెన్ అమ్మకాలు మూడు జిల్లాలలో దాదాపు నిలిచిపోయాయి. కేవలం మాంసం, చేపలు, రొయ్యల అమ్మకాలు మాత్రమే సాగాయి. పెళ్లిళ్లు, ఇతర కార్యక్రమాల్లోనూ, రెస్టారెంట్‌లు ఇలా ప్రతిచోటా చికెన్ తప్ప మిగిలిన మాంసాహారాలు మాత్రమే అందుబాటులో ఉండేవి. సంక్రాంతి నుంచి పౌల్ట్రీ పరిశ్రమ కోలుకుంటున్న సమయంలో బర్డ్ ఫ్లూ చావు దెబ్బతీసింది. జిల్లా సరిహద్దును ఆనుకుని తూర్పు గోదావరి జిల్లాలో మొదలైన బర్డ్ ఫ్లూ వైరస్ దెబ్బ కోనసీమ జిల్లా పౌల్ట్రీని కుదేలు చేసింది. ఈ జిల్లాలో వైరస్ జాడ లేకున్నా అమ్మకాలపై ప్రభావం చూపుతోంది. కోడి మాంసం, కోడి గుడ్డు అమ్మకాలను అధికారులు నిషేధించడంతో ధర పడిపోయి రైతులు.. అమ్మకాలు లేక వ్యాపారులు ఆందోళన చెందారు.

కొండెక్కుతున్న కోడిమాంసం ధరలు

బర్డ్ ఫ్లూతో ఇంచుమించు నెలన్నర రోజులు అతలాకుతలమైన పౌల్ట్రీ పరిశ్రమ పది రోజులుగా కోలుకుంటోంది. కోడి మాంసం ధరలు క్రమేపీ పెరుగుతున్నాయి. బ్రాయిలర్ లైవ్ రైతు వారీ కేజీ ధర రూ.152 వరకు ఉండగా షాపుల వద్ద లైవ్ రిటైల్ ధర కేజీ రూ.175 నుంచి రూ.180 వరకు ఉంది. కేజీ మాంసం ధర రూ.300కు పైబడి ఉంది. ఇక లేయర్ రిటైల్ ధర కేజీ రూ.125 నుంచి రూ.130 వరకు ఉండగా, మాంసం ధర కేజీ రూ.200 వరకు ఉంది. ప్రస్తుత మార్కెట్ పరిస్థితి చూస్తే బ్రాయిలర్, లేయర్ మాంసం ధరలు మరింత పెరిగే అవకాశముందని రైతులు, వ్యాపారులు అంచనా వేస్తున్నారు. బర్డ్‌ఫ్లూ ప్రచారం వల్ల బ్రాయిలర్ ఫిబ్రవరి 15 నుంచి మార్చి మొదటి వారం వరకు కొత్త బ్యాచ్‌లు (కోళ్ల పెంచడాన్ని) తగ్గించారు. దీనివల్ల మార్కెట్‌కు డిమాండ్‌కు తగిన కోళ్లు రావడం లేదు. ఇప్పుడున్న అవసరాలలో మూడవ వంతు కూడా కోళ్ల లభ్యత లేదని అమలాపురానికి చెందిన కోడి మాంసం విక్రయదారుడు యేసు సాక్షికి తెలిపాడు. ఈ కారణంగానే కోడి మాంసం ధరలకు రెక్కలు వచ్చాయి.

ధర పెరిగినా రైతుకు ఒరిగిందేమీ లేదు



పౌల్ట్రీ వ్యాపారంలో గత మూడు నెలల నుంచి తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొన్నాం. బర్డ్ ఫ్లూ వైరస్ వదంతులతో పెంచిన కోళ్లను ఇంకా మేపలేక దశల వారీగా విక్రయించుకుని తీవ్రమైన నష్టాలను చవిచూశాం. ఇటీవల ఉగాది, రంజాన్ సందర్భంగా బాయిలర్ ధరల పెరిగినా రైతులకు ఒరిగిందేమీ లేదు. ప్రస్తుతం బాయిలర్ కోళ్లు రైతుల వద్ద లేకపోవడంతో కంపెనీల నుంచి దిగుమతి చేసుకోవడంతో ఆ లాభాలు వాళ్లకే వెళ్లిపోతున్నాయి. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా పెరిగిన ధర నిలకడగా ఉండే అవకాశం కూడా లేదు.

– బొబ్బా వెంకన్న, పౌల్ట్రీ రైతు, పెదపళ్ల, ఆలమూరు మండలం, కోనసీమ జిల్లా

క్లుప్తంగా

కిక్ బాక్సింగ్‌లో నన్నయ విద్యార్థికి కాంస్య పతకం



మోహన్‌రాజ్‌ను అభినందిస్తున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ కిక్ బాక్సింగ్ పోటీలలో ఆదికవి నన్నయ యూనివర్సిటీ విద్యార్థి బెజవాడ మోహన్‌రాజ్ కాంస్య పతకాన్ని అందుకున్నాడని వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. యూనివర్సిటీలో మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆమె విద్యార్థిని అభినందించారు. యూనివర్సిటీ అనుబంధ కళాశాలలో ఒకటైన రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఈ విద్యార్థి ఉత్తరప్రదేశ్‌లోని స్వామి వివేకానంద సుభార్తి యూనివర్సిటీలో జరిగిన కిక్ బాక్సింగ్ పోటీలలో 75 కిలోల కేటగిరీలో ఈ పతకాన్ని సొంతం చేసుకున్నాడు.

దొంగతనం కేసులో 4 నెలల జైలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): దొంగతనం కేసులో ఒక వ్యక్తికి 4 నెలల జైలు శిక్ష విధిస్తూ ఐదవ ఏజేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి జి.శ్రీనివాసరెడ్డి మంగళవారం తీర్పునిచ్చారు. స్థానిక లక్ష్మీవారపుపేటకు చెందిన అధితం దుర్గా ప్రసాద్ 2024 నవంబర్ ఏడో తేదీన గాదిరెడ్డి వీధి, లక్ష్మీవారపేటలోని ఒక ఇంటిలో తాళాలు పగులగొట్టి రెండు టీవీలు, రెండు హెచ్‌పీ గ్యాస్ సిలిండర్లు దొంగిలిచుకుని వెళ్లిపోయాడు. దీనిపై కేసు నమోదు చేసిన త్రీటౌన్ పోలీసులు కోర్టుకు ఆధారాలు అందించారు. అసిస్టెంట్ ఏపీపీ బీవీ.మోహన్‌రావు వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. త్రీటౌన్ సీఐ వి.అప్పారావు, కోర్టు కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు పర్యవేక్షించి ఆధారాలు అందజేశారు.

తిరుమలలో రేపు అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం రూరల్: పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు రాజమహేంద్రవరం కాతేరులోని తిరుమల విద్యాసంస్థల ఆవరణలో గురువారం ఉదయం 10.00 గంటలకు జేఈఈ(మెయిన్), జేఈఈ (అడ్వాన్స్‌డ్) అండ్ నీట్‌పై అవగాహన సదస్సు జరుగుతుంది. ఈ మేరకు తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు ఓ ప్రకటనలో తెలిపారు. తమ పిల్లలు భవిష్యత్తులో ఐఐటీ, ఎయిమ్స్ వంటి ప్రతిష్టాత్మకమైన జాతీయస్థాయి కళాశాలలో విద్యనభ్యసించాలంటే ఎలా సంసిద్ధమవ్వాలో ఈ సదస్సులో వివరిస్తారని ఆయన అన్నారు. ఈ సదవకాశాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వివరాలకు 79970 71672, 77024 49686 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	15,500
గటగట (వెయ్యి)	14,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	14,500
గటగట (వెయ్యి)	13,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

రత్నగిరికి కొత్త సొబగులు

- విశ్వావసులో ప్రారంభం కానున్న కొత్త నిర్మాణాలు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రయత్నాలు నేటికి ఫలించిన వైనం
- భక్తుల కోసం రూ.33 కోట్లతో కొత్త నిర్మాణాలకు ఈ నెలలో శ్రీకారం



ప్రసాద్ నిధులతో నిర్మించనున్న అన్నదాన భవనం



లారస్ లాబ్ నిర్మించనున్న 'టెన్‌సిల్' షెడ్డు నమూనా చిత్రం

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి ×విశ్వావసు× నామ సంవత్సరం కొత్త సొబగులు తీసుకొస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒకేసారి రూ.33 కోట్ల వ్యయంతో భక్తుల కోసం వివిధ నిర్మాణాల పనులు ఈ నెలలోనే ప్రారంభం కానున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మొదలైన ప్రయత్నాలు ఇప్పటికి ఫలించాయి. కేంద్ర ప్రభుత్వ ×పిలిగ్రిమేజ్ రీజువినేషన్ అండ్ స్పిర్చ్యువల్ అగ్మెంటేషన్ డ్రైవ్ (ప్రసాద్) స్కీం కింద రూ.22 కోట్ల వ్యయంతో నిర్మించనున్న వివిధ నిర్మాణాలకు టెండర్లు మార్చి 22న ఖరారైన విషయం విదితమే. అన్నవరం దేవస్థానం నిధులతో సత్యగిరిపై రూ.8.82 కోట్ల అంచనా (జీఎస్టీతో కలిపి వాస్తవ వ్యయం రూ.11.40 కోట్లు) వ్యయంతో కొత్తగా సత్రం నిర్మించేందుకు పిలిచిన టెండర్లు గత శనివారం ఖరారు చేస్తూ దేవదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఆదేశాలు జారీ చేశారు. నాలుగు అంతస్తుల్లో 105 గదులతో ఆధునాతన సదుపాయాలతో ఈ సత్రం నిర్మించనున్నారు. విశాఖపట్నానికి చెందిన లారస్ యాజమాన్యం రూ.2.5 కోట్ల వ్యయంతో పశ్చిమ రాజగోపురం వద్ద విశాలమైన విశ్రాంతి షెడ్డు నిర్మించనుంది. ఆ సంస్థ యాజమాన్యం గత శనివారం అన్నవరం దేవస్థానానికి విచ్చేసి ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ నిర్మాణాలన్నింటికీ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిపాదనలు కాగా, ఎట్టకేలకు అవి నేటికి కార్యరూపం దాల్చాయి.

ఎట్టకేలకు దక్కిన కేంద్ర ప్రసాద్ం

కేంద్రంలో 2014లో అధికారంలోకి వచ్చిన ఎన్‌డీఏ ప్రభుత్వం దేశంలోని పలు పుణ్యక్షేత్రాలను భక్తి పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు ×ప్రసాద్× పథకాన్ని ప్రారంభించింది. దీనికి అన్నవరం దేవస్థానాన్ని ఎంపిక చేసింది. తొలుత రూ.వంద కోట్ల వ్యయమయ్యే నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించాలని కేంద్రం కోరింది. ఆ ప్రతిపాదనలు రూ.50 కోట్లకు ఆ తరువాత రూ.20 కోట్లకు పరిమితమయ్యాయి. అప్పటికి నిధులు మాత్రం మంజూరు కాలేదు. 2019లో కాకినాడ ఎంపీగా నెగ్గిన వంగా గీత పలుమార్లు కేంద్ర టూరిజం మంత్రి కిషన్‌రెడ్డి, టూరిజం శాఖ అధికారులను కలిసి ఒత్తిడి తేగా 2023లో రూ.22 కోట్లు మంజూరయ్యాయి. ఆ నిధులతో చేసే నిర్మాణాలకు 2024, మార్చి ఏడో తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీ జమ్ము కశ్మీర్ రాజధాని శ్రీనగర్ నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఆ తరువాత ఆ నిర్మాణాలకు జనవరి తొమ్మిదో తేదీన రూ.18.98 కోట్లకు టెండర్లు పిలవగా 16 శాతం తక్కువకు టెండర్లు ఖరారయ్యాయి. ప్రసాద్ నిధులతో రూ.11.09 కోట్లతో అన్నదాన భవనం, రూ.తొమ్మిది కోట్లతో భక్తుల క్యూ కాంప్లెక్స్, రూ.1.08 కోట్లతో వ్యర్థ జలాల శుద్ధి ప్లాంటు, రూ.91.96 లక్షలతో క్యూ కాంప్లెక్స్ ప్రహరీ, రూ.61.78 లక్షలతో టాయిలెట్ బ్లాకులు నిర్మించనున్నారు. రూ.కోటితో రెండు బ్యాటరీ కార్లు కొంటారు.

నాలుగు ఫ్లోర్‌లతో 105 గదులతో కొత్త సత్రం నిర్మాణం

కాగా, భక్తులకు మర్ని వసతి గదుల కోసం శిథిలావస్థకు చేరిన శ్రీ సీతారామ సత్రాన్ని పడగొట్టి ఆ స్థలంలో రూ.11 కోట్ల వ్యయంతో సత్రం నిర్మించాలని 2024లో అప్పటి ఈఓ కె.రామచంద్రమోహన్ భావించారు. దీనికి సంబంధించిన అనుమతులు వచ్చాక 2025 జనవరిలో రూ.11 కోట్లతో 105 గదులతో దక్షిణం వైపు బ్లాక్ (ఎ) నిర్మించడానికి టెండర్లు పిలిచారు. అయితే ఈ నెల నాలుగో తేదీన శ్రీ సీతారామ సత్రాన్ని పరిశీలించిన దేవదాయశాఖ సాంకేతిక సలహాదారు పి.కొండలరావు, చీఫ్ ఇంజినీర్ జీవీ శేఖర్, సాంకేతిక కమిటీ సభ్యులు ఈ సత్రాన్ని పడగొట్టి నూతన సత్రం నిర్మించేకన్నా దీనికి మరమ్మతులు చేసే విషయం పరిశీలించాలని సూచించారు. దాంతో సత్యగిరిపై విష్ణుసదన్ హాల్స్ పక్కన గల స్థలంలో ఈ సత్రాన్ని టెండర్‌లో ఉన్న ప్లాన్ ప్రకారం నిర్మించనున్నారు. ఈ సత్రం నిర్మాణానికి అంచనా వ్యయం రూ.8.82 కోట్లు కాగా ఆ సంస్థ 19.80 శాతం తక్కువకు రూ.7.07 కోట్లకే నిర్మాణం పూర్తి చేస్తామని కొటేషన్ దాఖలు చేసి ఎల్–1 గా నిలిచి కాంట్రాక్ట్ దక్కించుకుంది.



పశ్చిమ రాజగోపురం ఎదురుగా విశ్రాంతి షెడ్డు నిర్మించనున్న స్థలం

రూ.2.5 కోట్లతో పశ్చిమ రాజగోపురం వద్ద విశ్రాంతి షెడ్డు

దేవస్థానంలోని పశ్చిమ రాజగోపురం ఎదురుగా శిథిలావస్థకు చేరిన 30 వీఐపీ సత్రాన్ని 2023లో అప్పటి ఈఓ చంద్రశేఖర్ అజాద్ కూల్చేశారు. ఆ స్థలంలో భక్తులకు విశ్రాంతి షెడ్డు నిర్మాణానికి విశాఖపట్నానికి చెందిన ప్రముఖ ఫార్మాస్యూటికల్ కంపెనీ లారస్ లాబరేటరీస్ సంసిద్ధత తెలిపింది. శనివారం దేవస్థానానికి వచ్చిన లారస్ సీఈఓ చావా సత్యనారాయణ, ఈడీ వీవీ రవి కుమార్ షెడ్డు నిర్మాణానికి అంగీకరించారు. ఏక కాలంలో రెండు వేల మందికి పైగా భక్తులు ఇక్కడ విశ్రాంతి తీసుకునేలా షెడ్డు నిర్మించనున్నారు. 170 అడుగుల పొడవు, వంద అడుగుల వెడల్పుతో ×టెన్‌సిల్ । షెడ్డు నిర్మించనున్నారు. ఈ పనులు అన్నీ ఈ నెలలో ప్రారంభం కానున్నాయి. నీటి సమస్య ఉన్నప్పటికీ ఈ పనులు పూర్తి స్థాయిలో ప్రారంభమయ్యే నాటికి వర్షాలు ప్రారంభమై పనులకు ఆటంకం ఉండదని అధికారులు తెలిపారు.

పరీక్షలు పూర్తయిన ఆనందం అంతలోనే ఆవిరి

- కాలువ వద్ద ఆడుకోవడానికి వెళ్లి మృత్యువాత
- బాగా చదివే విద్యార్థిగా ఉపాధ్యాయుల మన్ననలు



అఖిల్ మృతదేహం

రామచంద్రపురం రూరల్: 10వ తరగతి పరీక్షలు పూర్తయిన ఆనందంలో తన స్నేహితులతో కలసి కాలువలో ఈత కొడుతూ కాసేపు ఆడుకుందామని వెళ్లిన ఓ విద్యార్థి నీట మునిగి చనిపోయిన విషాద ఘటన రామచంద్రపురం మండలం ఏరుపల్లి వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

రామచంద్రపురం పట్టణం రైలు గట్టుకు చెందిన యలమంచిలి అప్పారావు ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుటుంటున్నాడు. అతడికి ఉమా అఖిలేశ్వరరావు(అఖిల్)(15) కుమారుడు కాగా అఖిల్‌కి సోదరి ఉంది. అఖిల్ రామచంద్రపురం పిల్లా వారి హైస్కూల్‌లో 10 వ తరగతి చదువుతున్నాడు. చాకలిపేట హైస్కూల్‌లో పరీక్ష కేంద్రం కాగా ఆఖరి పరీక్ష మంగళవారం పూర్తయిన ఆనందంలో తన ఇద్దరి స్నేహితులతో కలసి వెల్ల కాలువ వద్దకు వెళ్లి మరో స్నేహితుడితో కలసి కాలువలో దిగాడు. మరో స్నేహితుడు వీరి దుస్తులు పట్టుకుని తాను కాలువలో దిగనని ఒడ్డునే ఉండి పోయాడు. కొద్దిసేపటికి అఖిల్ కనిపించకపోవడంతో స్నేహితులు కంగారు పడి కేకలు వేశారు. వీరి కేకలు విన్న స్థానికులు అక్కడకు చేరుకొని వెంటనే కాలువలో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. వెల్ల లాకుల వద్ద సాయంత్రం 5 గంటల సమయంలో వారికి అతని మృతదేహం దొరికింది.

బాగా చదివే విద్యార్థి అల్లరి చేయని విద్యార్థిగా ఉపాధ్యాయుల మన్ననలు..

కాగా పిల్లా వారి హైస్కూల్‌లో 10 వ తరగతి చదివిన అఖిల్ అసలు అల్లరి చేసేవాడు కాదని ఉపాధ్యాయులు చెప్పారు. తోటి విద్యార్థులు అల్లరి చేసినా తమకు చెప్పేవాడని, బాగా చదువుతాడని తప్పకుండా ఫస్ట్ క్లాస్‌లోనే పాస్ అవుతాడని ఉపాధ్యాయులు చెబుతున్నారు. అటువంటి విద్యార్థి మృతి చెందాడంటే నమ్మలేకపోతున్నామని ఉపాధ్యాయులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

భూ సమస్యల పరిష్కారానికి 'మీ కోసం .. మా సలహా'

- విశ్రాంత డీఆర్వో మారిశెట్టి జితేంద్ర స్వచ్ఛంద ఆన్‌లైన్ సేవా కేంద్రం
- వెబ్‌సైట్ ప్రారంభించిన మాజీ ఎంపీ ఉండవల్లి
- భూ సమస్యపై 80195 69393 నంబర్‌కి వాట్సాప్ చేస్తే చాలు



వెబ్‌సైట్ ప్రారంభిస్తున్న మాజీ ఎంపీ ఉండవల్లి

రాజమహేంద్రవరం సిటీ: భూ సమస్యల పరిష్కారానికి, ప్రజలకు అవగాహన కల్పించడానికి మీ కోసం మా సలహా పేరిట విశ్రాంత రెవెన్యూ ఉన్నతాధికారి మారిశెట్టి జితేంద్ర స్వచ్ఛందంగా ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ సేవాకేంద్రం వెబ్‌సైట్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ కుమార్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ప్రకాశంనగర్ ధర్మంచర కమ్యూనిటీ హాలుపైన బుక్ బ్యాంకులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వెబ్‌సైట్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీతి నిజాయితీతో ప్రభుత్వ ఉద్యోగం చేసి, పదవీ విరమణ చేశాక కూడా ప్రజలు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యలు ముఖ్యంగా భూ సమస్యలకు తనవంతు పరిష్కారం చూపించడానికి మారిశెట్టి జితేంద్ర ఆన్‌లైన్ సేవా కేంద్రం పెట్టడం అభినందనీయమన్నారు. భూములు, ఆస్తులు ఉన్న ప్రతీ ఇంట్లో ఏదో ఒక భూ సమస్య ఉంటుందని, ఏళ్లతరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రస్తావించి, పరిష్కరించుకోవడానికి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ప్రతిఫలం ఆశించకుండా ఇలాంటి కార్యక్రమాన్ని చేపట్టడం గొప్ప విషయమన్నారు. అయితే పోలవరం నిర్వాసితుల సమస్య ఎన్నాళ్ల నుంచో నానుతూనే ఉందని, గిరిజన ప్రజలకు న్యాయం చేకూరేలా తొలి సమస్యగా తానూ ప్రస్తావిస్తున్నానని ఉండవల్లి పేర్కొంటూ దీనికి పరిష్కారం చూపించాలని కోరారు. ఆయా శాఖల్లో పని చేసి పదవీ విరమణ చేసిన విశ్రాంత ఉద్యోగులు కూడా తమ స్థాయిల్లో ఇలాంటి సేవ చేస్తే ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని అన్నారు. జితేంద్ర మాట్లాడుతూ రెవెన్యూ విభాగంలో చిన్న చిన్న సమస్యలు సైతం పరిష్కారానికి నోచుకోకుండా ఏళ్లతరబడి జాప్యం అవుతున్నాయని, భూ సమస్యలు ఉన్నతాధికారుల స్థాయిలో కూడా పరిష్కారం కావడం లేదన్నారు. మంత్రులకు సైతం అవగాహన లేక పోవడం వలన భూ సమస్యలు పెండింగ్‌లో పడిపోతున్నాయన్నారు. దీనివలన రైతులు, ప్రజలు కూడా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ మధ్యకాలంలో కొన్ని సమస్యలు పరిష్కారం చేయించగలిగామని ఆయన చెబుతూ అప్పుడే ఒక వెబ్‌సైట్ పెట్టి స్వచ్ఛందంగా సేవలందించాలన్న సంకల్పం కలిగిందన్నారు. ఒకే సర్వే నంబర్‌తో స్థలాలు ఉండడం, ఒక అంకె తప్పు పడడం, వ్యవసాయ భూమి లే అవుట్‌గా రికార్డుల్లో నమోదై పోవడం, వివిధ ప్రాంతాల్లో ఉన్న ఆస్తులు ఒకేచోట రిజిస్టర్ అయిపోవడం ఇలా ఎన్నో సమస్యలు ఉన్నాయని గుర్తించామన్నారు. పరిష్కారం కాకుండా ఉండిపోయిన ఎలాంటి భూ సమస్య అయినా సరే 8019569393 నంబర్‌కి వాట్సాప్ చేస్తే , రంగంలోకి దిగి దాని పరిష్కారానికి తగిన సూచనలు చేసి నడిపిస్తామని జితేంద్ర చెప్పారు. సీపీ మోటార్స్ అధినేత చింతా ప్రసాదరెడ్డి, స్వర్ణాంధ్రా సేవాసంస్థ నిర్వాహకులు జి.రాంబాబు, అశోక్‌కుమార్ జైన్, కార్టూనిస్టు శేఖర్, విశ్రాంత ఉద్యోగి ధర్మారెడ్డి పాల్గొన్నారు.

నాటక రంగానికి సీఆర్‌సీ ప్రోత్సాహం ఎనలేనిది

ఆకట్టుకుంటున్న నాటికలు



మూడో రోజు నాటికలను ప్రారంభిస్తున్న సినీ నటుడు గౌతంరాజు, మాజీ ఎమ్మెల్సీ రెడ్డి సుబ్రహ్మణ్యం తదితరులు

రావులపాలెం: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను నేటి తరానికి అందిచాలనే సంకల్పంతో కాస్మోపాలిటన్ రిక్రియేషన్ క్లబ్ (సీఆర్‌సీ) ఆధ్వర్యంలో నాటక రంగానికి అందిస్తున్న ప్రోత్సాహం ఎనలేదని సినీనటుడు గౌతంరాజు, శాసనమండలి మాజీ డిప్యూటీ స్పీకర్ రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. సీఆర్‌సీ కళావేదికలో నిర్వహిస్తున్న 25వ ఉగాది ఆహ్వాన నాటికల పోటీలు విశేషంగా అలరిస్తున్నాయి. మూడో రోజు మంగళవారం నాటికలను వారు ప్రారంభించారు. బాపట్ల సహృదయ ద్రోణాదుల వారి వర్క్‌ఫ్రమ్ హోమ్ నాటికకు డి.మహేంద్ర దర్శకత్వం, అద్దేపల్లి భరత్ కుమార్ నాటకీకరణ వహించారు. కొలకలూరు శ్రీ సాయి ఆర్ట్స్ జనరల్ బోగీలు నాటికను గోపరాజు విజయ్ దర్శకత్వం, పీటీ మాధవ్ రచన వహించారు. రావులపాలెం సీఆర్‌సీ వారి ప్రత్యేక ప్రదర్శనగా అలాఎలా నాటికను రచన సీఆర్‌సీ రూపశిల్పి డాక్టర్ గొలుగూరి వెంకటరెడ్డి, నాటకీకరణ, దర్శకత్వం గంటా రామమోహన్ రావు వహించారు. చివరి రోజు నాటికలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఏర్పాట్లను సీఆర్‌సీ అధ్యక్షుడు తాడి నాగమోహనరెడ్డి, కార్యదర్శి నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి, నాటక కళాపరిషత్ డైరెక్టర్ కె.సూర్య, పరిషత్ పర్యవేక్షణ డైరెక్టర్ పలివెల త్రిమూర్తులు, డైరెక్టర్లు సత్తి సూర్య భాస్కరరెడ్డి, నడింపల్లి వెంకట సుబ్బరాజు, దండు వెంకట సూర్యనారాయణరాజు, కుడుపూడి శ్రీనివాస్, పడాల సత్యనారాయణరెడ్డి పర్యవేక్షించారు.



వర్క్ ఫ్రమ్ హోమ్ నాటికలో ఒక సన్నివేశం

వృద్ధుల సంక్షేమానికి డీఎల్ఎస్ఏ కృషి



స్వర్ణాంధ్ర సేవాసంస్థలో వృద్ధులతో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి

రాజమహేంద్రవరం సిటీ: వృద్ధులకు ఏవిధమైన సహాయ సహకారాలనైనా అందించేందుకు డీఎల్ఎస్ఏ కృషి చేస్తుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. శ్రీలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం నగరంలో లాలచెరువు వద్ద ఉన్న స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమాన్ని సందర్శించి, నల్సా (సీనియర్ సిటిజన్లకు చట్టపరమైన సేవలు) పథకం, 2016 పై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలో వసతులను, సదుపాయాలను పరిశీలించారు. వయోవృద్ధులకు అందుతున్న సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి న్యాయ సహాయం కావాలన్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు తెలియజేయాలన్నారు.

కారును ఢీకొట్టిన లారీ

- సురక్షితంగా బయటపడిన భార్యాభర్తలు

కొవ్వూరు: పట్టణంలో గామన్ ఇండియా టోల్‌ప్లాజా వద్ద కారును వెనుక నుంచి లారీ ఢీకొట్టిన ప్రమాదంలో కారు పూర్తిగా దెబ్బతింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వీరగంధం శ్రీనివాసరావు అతని భార్య క్షేమంగా బయటపడ్డారు. గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన శ్రీనివాసరావు అతని భార్యతో కలిసి కాకినాడ వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. టోల్ ప్లాజా వద్ద కారుకి ముందు వెళుతున్న లారీ బ్రేక్ వేయడంతో కారు వెనుక వస్తున్న లారీ ఢీకొట్టింది. కారును లారీ కొద్ది దూరం ఈడ్చుకుని వెళ్లింది. దీంతో కారు నుజ్జునుజ్జు అయ్యింది. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా దెబ్బతింది. శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఆర్.సాంబమూర్తి తెలిపారు.



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

ఓడలరేవు సొసైటీ సీఈవోపై హత్యాయత్నం

- రూ.లక్ష నగదు, బంగారు ఉంగరం తస్కరణ
- ఓ మాయ'లేడీ' పన్నిన వలలో చిక్కిన వైనం
- ముగ్గురి అరెస్ట్
- కాకినాడ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సీఈవో

అమలాపురం టౌన్: ఓ మాయ'లేడీ' పన్నిన వలలో అల్లవరం మండలం ఓడలరేవు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ) సీఈవో సత్తి వెంకటేశ్వరరావు పడి ఆమె చేతిలో హత్యాయత్నానికి గురయ్యారు. అమలాపురం నల్లవంతెన సమీపంలో గల సాయి సిద్ధి అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న వెంకటేశ్వరరావు ఈ నెల 17వ తేదీ రాత్రి ఆ వగలాడి మాయలో పడి సొసైటీకి వసూళ్ల ద్వారా వచ్చిన రూ.లక్ష నగదును, తన చేతి వేలికి ఉన్న బంగారు ఉంగరాన్ని పోగొట్టుకున్నాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ హత్యాయత్న ఘటనలో కాకినాడకు చెందిన కుమారి (30), ఆమెకు సహకరించిన అమలాపురం రూరల్ మండలం బండార్లంకకు చెందిన టి.వెంకటరమణ, అదే మండలం ఇందుపల్లికి చెందిన తుక్కు సుబ్రహ్మణ్యంలను మంగళవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. సీఐ చెప్పిన వివరాల ప్రకారం....

సీఈవో వెంకటేశ్వరరావుకు అమలాపురం కలశం సెంటరులో ఓ తోపుడు బండి వద్ద పానీ పూరి తినడం అలవాటు. గత నెల 17వ రాత్రి 8.30 గంటలకు సీఈవో పానీ పూరీ తింటుండగా కుమారి అనే మహిళ అతనితో మాట కలిపింది. తర్వాత ఇద్దరూ కలిసి బండార్లంక గ్రామానికి వెళ్లారు. అక్కడ కుమారి సీఈవోతో మద్యం తాగించింది. ఆ మద్యంలో మత్తు బిళ్లలు కలిపింది. ఆ మత్తు సీఈవోపై అంత ప్రభావం చూపకపోవడంతో అక్కడ నుంచి ఇందుపల్లికి చెందిన తుక్కు సుబ్రహ్మణ్యానికి చెందిన అమలాపురం పట్టణం నారాయణపేటలో గల రూమ్‌కి తీసుకుని వచ్చింది. బండార్లంకకు చెందిన వెంకటరమణ గడ్డి మందు తెచ్చి కుమారికి ఇచ్చాడు. ఆ మందును ముందు కూల్ డ్రింక్‌లోనూ, ఆ తర్వాత మద్యంలోనూ కలిపి సీఈవోతో తాగించింది. దీంతో సీఈవో అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో అతని వద్ద ఉన్న రూ.లక్ష నగదు, బంగారు ఉంగరాన్ని కుమారి కాజేసి అక్కడ నుంచి పరారైంది. తర్వాత కొంత తేరుకున్న సీఈవో తెల్లవారు జామున ఇంటికి అతి కష్టంగా చేరుకున్నాడు. జరిగిన అవమానాన్ని ఇంట్లో వారికి చెప్పకుండా ఏవో సాకులు చెప్పి ఇంట్లోనే ఆర్ఎంపీ వైద్యుడి ద్వారా చికిత్స పొందుతున్నాడు. గత నెల 26న కుటుంబీకులు నిలదీయంతో సీఈవో అసలు విషయం చెప్పాడు. హత్యాయత్నంపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అతడిని అత్యవసర వైద్యం కోసం కాకినాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఫిర్యాదుపై పోలీసులు రంగంలోకి దిగి నిందితులను ముగ్గురిని పట్టుకుని విచారించారు. వారు పోలీసుల వద్ద నేరాన్ని అంగీకరించడంతో కుమారి, వెంకటరమణ, సుబ్రహ్మణ్యంలను మంగళవారం అరెస్ట్ చేసినట్లు సీఐ వీరబాబు తెలిపారు.

అన్నా క్యాంటీన్ డబ్బులు ఇప్పించండి మహాప్రభో

కాంట్రాక్టర్ ఆవేదన

పిఠాపురం: అన్నా క్యాంటీన్లు కట్టించుకున్నారు. ఆర్భాటంగా ప్రారంభించి పేదలకు అన్నం పెడుతున్నామంటున్న అధికారులు, నాయకులు కట్టిన తనకు అన్నం లేకుండా చేస్తున్నారంటూ పిఠాపురానికి చెందిన కాంట్రాక్టర్ ఎస్ దివాణం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయన ఈ మేరకు మీడియాకు తన ఆవేదనతో కూడిన లేఖను మంగళవారం విడుదల చేశారు. పిఠాపురం, ఏలేశ్వరం, పెద్దాపురం గొల్లప్రోలులో అన్నా క్యాంటీన్ల నిర్మాణంకు తనకు కాంట్రాక్టు పనులు అప్పగించారన్నారు. వాటిని సకాలంలో పూర్తి చేసి అధికారులకు అప్పగించానన్నారు. అయితే నెలలు గడుస్తున్నా తనకు బిల్లులు ఇవ్వకుండా తిప్పుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు అడుగుతుంటే అధికారులు సమాధానం చెప్పకుండా తనను మానసికంగా హింసిస్తున్నారని, దీంతో తాను తీవ్ర మనోవేదనకు గురవుతున్నట్లు ఆయన తెలిపారు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి అన్నా క్యాంటీన్లు నిర్మించానని బిల్లులు రాక వడ్డీలు పెరిగి అప్పులు తలకు మించిన భారంగా మారాయని, బిల్లులు ఇవ్వక పోతే ఆస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితి వస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉప ముఖ్యమంత్రి నియోజకవర్గంలో ఇలా ఒక కాంట్రాక్టరుకు ఇబ్బందులకు గురి చేయడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు తన బిల్లులు విడుదల చేయాలని ఆయన కోరారు.